

కలైంజర్ చేతివృత్తుల పథకాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

విద్యను దూరం చేసే 'విశ్వకర్మ' మాకొద్దు

● అన్ని కులాల వారికి చేతివృత్తుల్లో శిక్షణ

● కుండ్రత్తూరు సభలో సీఎం స్టాలిన్

● అట్టహాసంగా కలైంజర్ చేతివృత్తుల పథకం ప్రారంభం

చెన్నై, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రెండేళ్లకు ముందు ప్రవేశపెట్టిన 'విశ్వకర్మ' పథకం సామాజిక న్యాయానికి వ్యతిరేకంగా, యువతను విద్యకు దూరం చేసేలా ఉండడాన్ని తమ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని సీఎం స్టాలిన్ అన్నారు. కాంచీపురం జిల్లా కుండ్రత్తూరు సేక్కిళార్ ప్రభుత్వ బాలుర మహోన్నత పాఠశాల ప్రాంగణంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఏర్పాటైన కార్యక్రమంలో కలైంజర్ చేతివృత్తుల పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 8971 మంది లబ్ధిదారులకు రూ.34కోట్ల సబ్సిడీతో రూ.170 కోట్ల మేరకు రుణ మంజూరు అంగీకార ఉత్తర్వులను అందజేశారు. అదే విధంగా తంజావూరు పేరావూరణి రూ.7.29 కోట్లతో నెలకొల్పిన పేరావుర్ని తాళ్ల తయారీ గ్రూపు, రామనాథపురం జిల్లా వసంత్‌నగర్‌లో రూ.6.72 కోట్లతో ఏర్పాటైన గ్రూపు, నగల తయారీ గ్రూపు, తెన్‌కాశి జిల్లా ఆలంకుళం నగర్‌లో రూ.1.15 కోట్లతో ఏర్పాటైన మహిళల ఎంబ్రాయిడరీ గ్రూపును ప్రారంభించారు.

అజ్ఞానులుగా మార్చడానికా?

రాష్ట్ర ప్రభుత్వం పుదుమైపెణ్, తమిళ్‌పుదల్వన్ పథకాల ద్వారా పాఠశాల విద్యను పూర్తిచేసుకున్న యువతీయువకులంతా పట్టభద్రులు కావాలని, వారిని ఉన్నత విద్యాకోర్సులలో ప్రవేశం కల్పిస్తుంటే, కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం కులవృత్తిపై శిక్షణలందించి వారిని బయటి ప్రపంచం గురించి కూడా తెలియనంత అజ్ఞానులుగా, విద్యావిహీనులుగా మార్చేందుకు ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. 1950లోనే కులవృత్తి విద్యను తీవ్రంగా వ్యతిరేకించిన తమిళ ప్రజలు ఈ పథకాన్ని ఎలా అంగీకరిస్తారని ఆయన ప్రశ్నించారు.

విశ్వకర్మ పథకంలో ప్రధానంగా ఉన్న మూడు లోపాలను సవరించమంటూ ప్రధాని మోదీకి లేఖ కూడా రాశానని చెప్పారు. దరఖాస్తుదారుడి కుటుంబం కులవృత్తి చేస్తుండాలనే నిబంధనను రద్దు చేయమని, ఏ కులస్థులైనా ఏ కుల వృత్తినైనా చేపట్టే రీతిలో మార్పు చేయమని కోరానని తెలిపారు. అదే

లోపాలను సవరించరా?

విధంగా దరఖాస్తుదారుడి వయోపరిమితిని 18 నుంచి 35 యేళ్లకు పెంచమని, గ్రామీణ ప్రాంతాల్లోని లబ్ధిదారులను గుర్తించే బాధ్యతను సర్పంచులకు బదులుగా గ్రామ నిర్వహణాధికారికి అప్పగించాలని కూడా విజ్ఞప్తి చేశానని, ఈ మూడు డిమాండ్లను ప్రధాని మోదీ పట్టించుకోలేదన్నారు. విశ్వకర్మ పథకం లోపభూయిష్టంగా ఉండటం వల్లే తాము కులాలను బట్టి కాకుండా ఏ కులస్థుడైనా 25 రకాల చేతివృత్తుల్లో ఏదైనా ఒకదాన్ని ఎంచుకుని శిక్షణ పొంది ప్రభుత్వ సాయం పొందగలిగేలా కలైంజర్ చేతివృత్తుల పథకాన్ని ప్రారంభించినట్లు చెప్పారు.

విశ్వకర్మ పథకానికి దీటుగా...

కేంద్రంలోని ప్రధానిమోదీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం 2023లో హస్తకళాకారులకు శిక్షణలందించి రూ.3లక్షల రుణాన్ని అందజేసే విశ్వకర్మ పథకం డీఎంకే ప్రభుత్వం అనుసరించే సామాజిక న్యాయానికి వ్యతిరేకంగా ఉందని ఆరోపిస్తూ ఆ పథకానికి దీటుగా రాష్ట్రంలో సరికొత్త హస్తకళాకారుల అభివృద్ధి పథకం అమలు చేస్తామని 2024-25 బడ్జెట్ ప్రసంగంలో పేర్కొంది. ఆ మేరకు ప్రస్తుతం కలైంజర్ చేతివృత్తుల పథకాన్ని స్టాలిన్ ప్రారంభించారు. ఈ పథకం కింద వడ్రంగి, పడవల తయారీ, లోహపు వస్తువుల తయారీ, బీగాల తయారీ, అద్దాలతో కళాత్మక వస్తువుల తయారీ, కుండల తయారీ, భవన నిర్మాణ పనులు, బుట్టల అల్లిక, చాపల తయారీ అంటూ 25 రకాల చేతివృత్తుల ఆధారంగా వ్యాపారం చేయడానికి ప్రభుత్వం సబ్సిడీపై రుణాలను అందజేస్తుంది. ఈ పథకం ప్రారంభోత్సవ సభలో స్టాలిన్ ప్రసంగిస్తూ... కేంద్రం ప్రవేశపెట్టిన విశ్వకర్మ పథకం 18 రకాల కులవృత్తుల చేస్తున్న కళాకారులకు శిక్షణను అందించే వారికి రూ.3లక్షల రుణం అందజేసే పథకమని, ఆ పథకం కనిష్ఠ యోపరిమితి 18 యేళ్లుగా ప్రకటించి ఉండటం చూసి తాను దిగ్భ్రాంతి చెందానన్నారు. 18 యేళ్ల ప్రాయం మంచి చదువులు చదవాల్సిన యువకులను వంశపారంపర్యంగా చేస్తున్న కులవృత్తికే పరిమితం చేసేలా ఆ పథకం ఉందని విమర్శించారు. విశ్వకర్మ పథకం దరఖాస్తుదారుడు, అతడి కుటుంబం వంశపారపర్యంగా ఏదైనా కులవృత్తిని కొనసాగిస్తుంటే ఆ పథకం ద్వారా లబ్ధి పొందగలుగుతాడన్నారు. ఈ లోపాలు ఉండటం వల్లే తమ ప్రభుత్వం విశ్వకర్మ పథకాన్ని పూర్తిగా నిరాకరిస్తోందని చెప్పారు. ద్రావిడ తరహా పాలనలో సామాజిక న్యాయానికే అగ్రతాంబూలం ఇస్తుందని చెప్పారు.

భారీ పరిశ్రమలతో పోటీపడుతున్న ఎంఎస్ఎంఈలు

రాష్ట్రంలో సూక్ష్మ, చిన్నతరహా, మధ్యతరహా పరిశ్రమలన్నీ ప్రస్తుతం భారీ పరిశ్రమలతో పోటీపడే విధంగా అభివృద్ధి చెందాయని స్టాలిన్ తెలిపారు. అత్యధిక ఎంఎస్ఎంఈలు కలిగిన రాష్ట్రాల్లో తమిళనాడు మూడో స్థానంలో ఉందని, రాష్ట్రంలో 33 లక్షల దాకా ఎంఎస్ఎంఈలు ఉన్నాయని ఆయన చెప్పారు. ఇక పరిశ్రమలను ప్రోత్సహించే విధంగా పారిశ్రామికవేత్తలను ఉత్సాహపరిచే రీతిలో ఐదు ప్రకటనలు చేయదలిచానని ఆయన చెప్పారు.

ఐదు ప్రకటనలు

ఆ మేరకు భౌగోళిక గుర్తింపు పొందటానికి ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని రూ.25 వేల నుండి రూ.లక్షకు పెంచుతున్నట్లు ప్రకటించారు. అంబత్తూరు పారిశ్రామికవాడలో వాహన, ఇంజనీరింగ్ విడిభాగాలు తయారు చేస్తున్న సంస్థలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం అందించడానికి అనువుగా రూ.5కోట్లతో ప్రయోగశాలలు ఏర్పాటు చేస్తామని, కాంచీపురం జిల్లాలో పరిశ్రమలు ఎక్కువగా ఉన్న పళయతండలంలో రహదారులు, వాననీటి కాల్వల నిర్మాణం వంటి సదుపాయాల కల్పనకు రూ.5 కోట్లు కేటాయిస్తామని తెలిపారు. కాకలూరు పారిశ్రామికవాడలో సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణలందించే కేంద్రం తదితర సదుపాయాలతో రూ.1.90 కోట్లతో కనీస సదుపాయాల కేంద్రం ఏర్పాటు చేస్తామని, ఎంఎస్ఎంఈలు తమ ఉత్పత్తులను ప్రదర్శించేందుకు ఎగ్జిబిషన్ హాళ్ల చెల్లించే రుసుము కోసం అందజేసే ఆర్థిక సహాయాన్ని రూ.లక్ష నుండి రూ.2 లక్షలకు పెంచుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామో అన్బరసన్, ఎంపీలు టీఆర్‌బాలు, సెల్వం, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై, శాసనసభ్యులు ఎస్ఎస్ బాలాజీ, వరలక్ష్మి మధుసూదనన్, ఎం. బాబు, ఇ.కరుణానిధి, ఎస్ఆర్ రాజా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, ఎంఎస్ఎంఈల శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అతుల్ ఆనంద్, ప్రతిభాపాటవాల అభివృద్ధి శాఖ కార్యదర్శి కె.వీరరాఘవరావు, పరిశ్రమల కమిషనర్ ఎల్.నిర్మల్‌రాజ్, కాంచీపురం జిల్లా కలెక్టర్ కలైసెల్వి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

టీవీకేతో పొత్తుకు పీఎంకే రహస్య మంతనాలు?

● డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని డిమాండ్




టీవీకే నేత విజయ్, పీఎంకే నేత రాందాస్

చెన్నై, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకేతో పొత్తుపై ఆశలు పెట్టుకుని నిరాశ చెందిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) నేత విజయ్, బీజేపీతో పొత్తును తీవ్రంగా వ్యతిరేకిస్తున్న పీఎంకే వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ రాందాస్ శాసనసభ ఎన్నికల్లో పొత్తుపై రహస్య మంతనాలు జరుపుతున్నట్లు తెలిసింది. రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు యేడాది గడువు ఉన్నప్పటికీ ప్రధాన పార్టీలన్నీ పొత్తులు కుదుర్చుకోవడానికి ఇప్పటినుంచే ప్రయత్నాలు సాగిస్తున్నాయి. జాతీయ పార్టీ బీజేపీ అన్ని పార్టీల కంటే ముందుగా అన్నాడీఎంకేతో పొత్తును ఖరారు చేసుకుంది. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సమక్షంలో ఈ పొత్తు కుదరడం గమనార్హం. ఇక డీఎంకే కూటమిలో ప్రస్తుతం ఉన్న మిత్రపక్షాలే కొనసాగే అవకాశాలున్నాయి. ఈ పరిస్థితుల్లో టీవీకే తొలి మహానాడులో విజయ్ ప్రసంగిస్తూ.. తమ పార్టీతో డీఎంకే మినహా ఏ పార్టీ అయినా పొత్తు పెట్టుకోవచ్చని, ఆ పార్టీలకు అధికారంలో తప్పకుండా భాగస్వామం కల్పిస్తామని ప్రకటించారు. ఆ ప్రకటన అన్ని రాజకీయ పార్టీల్లోనూ కలకలం సృష్టించింది. ఆ సమయంలో విజయ్ పార్టీతో అన్నాడీఎంకే పొత్తుపెట్టుకుంటుందని ఊహాగానాలు చెలరేగాయి. చివరకు అన్నాడీఎంకే బీజేపీతో పొత్తుపెట్టుకుంది.

అయోమయంలో విజయ్...

డీఎంకేని ప్రధాన రాజకీయ శత్రువుగా ప్రకటించిన విజయ్‌కి ప్రస్తుతం ఏయే పార్టీలతో పొత్తు పెట్టుకోవాలనే విషయంలో అయోమయం నెలకొంది. చివరి ప్రయత్నంగా ఓటు బ్యాంక్ ఉన్న పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే)పై దృష్టి సారించారు. ఇటీవల ఎన్నికల పొత్తు విషయంలో అభిప్రాయ భేదాలు వచ్చి పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, మాజీ అధ్యక్షుడు అన్బుమణి రాందాస్ ఎడమొహం పెడమొహంగా వ్యవహరిస్తున్నారు. అన్బుమణి బీజేపీతో పొత్తు పెట్టుకోవాలని డిమాండ్ చేస్తుండగా, రాందాస్ కుదిరితే డీఎంకేతో కుదరకపోతే టీవీకేతో పొత్తు పెట్టుకోవాలని భావిస్తున్నారు. అయితే డీఎంకే కూటమిలో డీపీఐ ఉండటంతో ఆ కూటమిలో చేరటానికి రాందాస్ తటపటాయిస్తున్నారు. ఒకవేళ డీఎంకేతో పొత్తు పెట్టుకున్నా తమకున్న వన్నియార్ల ఓటు బ్యాంక్‌కు సరిపడా నియోజకవర్గాలు లభించవని భావిస్తున్నారు. ఈ పరిస్థితి గురించి తెలుసుకున్న విజయ్ తన పార్టీలో ప్రధాన వ్యవహారాలు చూసుకుంటున్న ప్రముఖ ఆడిటర్‌ను రాందాస్ వద్దకు రాయబారం పంపినట్లు తెలిసింది. దిండివనం తైలాపురం గార్డెన్‌కు వెళ్లి ఆ ఆడిటర్ రాందాస్‌ను కలుసుకున్నారు. ఆ సందర్భంగా రాందాస్ మాట్లాడుతూ విజయ్ నటించిన సినిమాలకు జనబాహుళ్యంలో మంచి ఆదరణ లభిస్తోందని, ఆయనకు అభిమానులు కూడా ఎక్కువేనని ప్రశంసించారు. వన్నియార్లకు ఓటు బ్యాంక్ అధికంగా ఉండటంతో తమ పార్టీతో పొత్తుపెట్టుకోవాలంటే అన్బుమణికి డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని రాందాస్ ప్రతిపాదించారు. ఎన్నికలలో టీవీకే శ్రేణుల కంటే పీఎంకే శ్రేణులే రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేయగలరనే విషయాన్ని విజయ్ గుర్తించాలని కూడా రాందాస్ తెలిపారు. పీఎంకేకు 90 స్థానాలు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసిన ఆ ఆడిటర్.. డిప్యూటీ సీఎం పదవిపై మాత్రం ఏమి తేల్చనట్టు సమాచారం. విజయ్‌తో చర్చించి చెబుతానని పేర్కొన్నట్టు తెలిసింది.

సోషల్ మీడియాలో మనమే బెస్ట్

● టీవీకే ఐటీ వింగ్ సమావేశంలో విజయ్



వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రసంగిస్తున్న విజయ్

చెన్నై, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం సోషల్ మీడియా దేశంలోనే బెస్ట్ అని దేశవ్యాప్తంగా ప్రశంసిస్తున్నారని ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ అన్నారు. షోళింగనల్లూరులో శనివారం ఉదయం జరిగిన పార్టీ ఐటీ వింగ్ సమావేశంలో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. ఐటీ వింగ్ సమావేశం ప్రారంభమైనప్పుడే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడాలని అనుకున్నానని, సాంకేతిక కారణాల వల్ల సరైన సమయంలో మాట్లాడలేకపోయానని చెప్పారు. టీవీకే సోషల్ మీడియాలో అత్యధిక సభ్యులున్న దళం అంటూ దేశమంతటా పొగడుతున్నారని తెలిపారు. ఐటీ వింగ్‌లోని సభ్యులందరూ తాను అభిమానులుగా భావించడం లేదని, కదనరంగంలో దూసుకువెళ్లే సైనికులుగానే భావిస్తున్నానని చెప్పారు. త్వరలోనే అందరిని నేరుగా కలుసుకుంటానని విజయ్ సంక్షిప్తంగా తన ప్రసంగాన్ని ముగించారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందుకున్న పి.వీరరాఘవులు, ఎం.లక్ష్మి భర్త మహేశ్వరరావు, వి.రామచంద్రయ్య, సుభద్ర

చెన్నై, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన 'కార్ అండ్ బైక్ రేసు' పోటీలో లక్కీ డ్రా ద్వారా ఎంపికైన తమిళనాడు పాఠకులు కన్సోలేషన్ బహుమతులు అందుకున్నారు. గతేడాది నవంబరు 1నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు నెలకు మూడు చొప్పున మొత్తం 12 కూపన్లను నాలుగు సెట్లుగా పంపిన పాఠకుల్లో విజేతలను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన లక్కీడ్రా గత మార్చి 25వ తేదీన తిరుపతి కార్యాలయంలో జరగ్గా, తమిళనాడు నుంచి నలుగురు పాఠకులు కన్సోలేషన్ బహుమతులకు ఎంపికయ్యారు. ఆ మేరకు చెన్నైకి చెందిన పి.వీరరాఘవులు, ఎం.శ్రీలక్ష్మి, సుభద్ర, తిరుత్తణికి చెందిన వి.రామచంద్రయ్య ఈ బహుమతులకు ఎంపికయ్యారు. వారికి శనివారం చెన్నైలోని ఆంధ్రజ్యోతి కార్యాలయ బ్రాంచ్ మేనేజర్ డాక్టర్ ఎస్‌కే మహమ్మద్ గౌస్‌బాషా కన్సోలేషన్ బహుమతులను అందించారు.

చెన్నైలో ఏసీ సబర్బన్ రైలు సేవలు ప్రారంభం

● ప్రయాణికుల హర్షం



చెన్నై బీచ్ నుంచి బయల్దేరుతున్న ఏసీ సబర్బన్ రైలు

పెరంబూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న 'ఏసీ' సబర్బన్ రైలు సేవలు ఎట్టకేలకు శనివారం ప్రారంభమయ్యాయి. ఐసిఎఫ్‌లో 12 బోగీల 'ఏసీ' సబర్బన్ రైలును కూర్చొని 1,116 మంది, నిలబడి 3,798 మంది ప్రయాణించేలా రూపొందించారు. ఈ రైలు సేవలు ఈనెల 6వ తేది ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభిస్తారని భావించగా, అనివార్య కారణాలరీత్యా వాయిదా పడింది. ఈ నేపథ్యంలో, చెన్నైలో తొలి ఏసీ సబర్బన్ రైలు సేవలు శనివారం ప్రారంభమయ్యాయి.



తొలి ఏసీ సబర్బన్ రైలు డ్రైవర్ పిచ్చాండి

ఛార్జీల వివరాలు...

ఈ రైలు కనిష్ఠ ఛార్జీగా 10 కి.మీ లోపు రూ.35, గరిష్ఠ ఛార్జీగా రూ.105 నిర్ణయించారు. సబర్బన్ రైలులో ఏసీ తరగతి సీజన్ టిక్కెట్టు కలిగిన ప్రయాణికులు ఈ రైలులో ప్రయాణించేందుకు అనుమతి లేదు. ఈ రైలు సీజన్ టిక్కెట్టు ఛార్జీలు త్వరలో ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రయాణ సమయాలు...

చెన్నై బీచ్ నుంచి ఉదయం 7 గంటలు, మధ్యాహ్నం 3.45, రాత్రి 7.35 గంటలకు బయల్దేరే రైలు, తాంబరానికి ఉదయం 7.42, సాయంత్రం 4.26, రాత్రి 8.30 గంటలకు చేరుకుంటుంది. అక్కడి నుంచి రెండు సర్వీసులుగా చెంగల్పట్టుకు ఉదయం 8.35 గంటలు, సాయంత్రం 5.25 గంటలకు చేరుకుంటుంది. చెంగల్పట్టు నుంచి ఉదయం 9 గంటలు, సాయంత్రం 5.45 గంటలకు బయల్దేరే రైలు, తాంబరంకు 9.41 గంటలు, సాయంత్రం 6.26 గంటలకు చేరుకుంటుంది. అక్కడి నుంచి బయల్దేరి చెన్నై బీచ్‌కు ఉదయం 10.30 గంటలు, రాత్రి 7.15 గంటలకు చేరుకుంటుంది. ఇక ఉదయం సర్వీసుగా తాంబరం నుంచి ఉదయం 5.45 గంటలకు బయల్దేరి 6.45 గంటలకు చెన్నై బీచ్ చేరుకుంటుంది. ఈ రైలు ఉదయం తాంబరం డిపో నుంచి బయల్దే చెన్నై బీచ్‌కు వచ్చే సమయం, రాత్రి చెన్నై బీచ్ నుంచి తాంబరం డిపోకు వెళ్లే సమయాల్లో సబర్బన్ రైళ్ల మార్గంలో వెళుతుంది. ఎక్స్‌ప్రెస్ మార్గంలో వెళ్లే సమయంలో ఈ రైలు ఫోర్ట్, పార్క్, ఎగ్మూర్, మాంబళం, గిండి, సెయింట్ థామస్ మౌంట్, తాంబరం, పెరుంగళత్తూర్, గుడువాంజేరి, పొత్తేరి, సింగపెరుమాళ్ కోయిల్, భరనూరు తదితర స్టేషన్లలో ఆగనుంది.

సమాచార దర్శిని

నేడు 'హరి కథాలహరి - నిత్య నూతన సుధా మాధురి'

చెన్నై, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): 'వేద విజ్ఞాన వేదిక' ఆధ్వర్యంలో స్థానిక టీ.నగర్ విజయ రాఘవ రోడ్డులో వున్న ఆంధ్రా క్లబ్‌లో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు 'తరతరాల తెలుగు కవిత' కార్యక్రమం జరగనుంది. ప్రముఖ రచయిత్రి, పరిశోధకురాలు డాక్టర్ ప్రభల జానకి 'హరి కథాలహరి - నిత్య నూతన సుధా మాధురి' అనే అంశంపై ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని సంస్థ అధ్యక్షుడు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

26న అష్టావధానం

చెన్నై, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (ఆస్కా) ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 26న సాయంత్రం 5.45 గంటలకు అష్టావధానం జరగనుంది. ద్విశతావధాని డాక్టర్ బులుసు అపర్ణ, మరో 8 మంది మహిళల ఆధ్వర్యంలో ఈ అష్టావధానం జరగనుంది. రాపర్తి ఝాన్సీ, డాక్టర్ తిరుమల ఆముక్త మాల్యద, డాక్టర్ పీఎస్ మైథిలి, డాక్టర్ టి.మోహనశ్రీ, డాక్టర్ ఏవీ శివ కుమారి, ఎస్‌పీ వసంతలక్ష్మి, కమలాకర రాజేశ్వరి, బిట్ర గజగౌరి పృచ్ఛకులుగా వ్యవహరించనున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని ఆస్కా ట్రస్టు చైర్మన్ డాక్టర్ కె.సుబ్బారెడ్డి, మేనేజింగ్ ట్రస్టీ పి.శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి ఎ.ఆదినారాయణరెడ్డి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

నటుడు బాబీసింహా కారు ఢీకొని ముగ్గురికి గాయాలు

ప్యారీస్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ తమిళ సినీ నటుడు బాబీసింహా కారు ఢీకొనడంతో ముగ్గురు గాయపడగా, ఏడు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటన గిండిలోని కత్తిపార ఫ్లై ఓవర్‌పై కలకలం రేపింది. నటుడు బాబీసింహా డ్రైవర్ పుష్పరాజ్ శుక్రవారం రాత్రి బాబీసింహా తండ్రిని ఓ చోటదింపి, తిరిగి మనపాక్కానికి తిరుగు ప్రయాణమయ్యాడు. ఆ కారు గిండి కత్తిపార ఫ్లైఓవర్ నుంచి ఆలందూర్ మెట్రో రైల్వేస్టేషన్ వైపుకు వెళ్తున్న సమయంలో అదుపుతప్పి, వంతెనపై వెళ్తున్న రెండు కార్లు, రెండు ఆటోలు, మూడు ద్విచక్ర వాహనాలను ఢీకొని ప్రహరీని ఢీకొని ఆగింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంలో వెళ్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకుని ఘటనా స్థలానికి చేరుకున్న ట్రాఫిక్ విభాగం పోలీసులు మద్యం మత్తులో కారు నడిపిన పుష్పరాజ్‌ను అరెస్టు చేశారు. క్షతగాత్రులను క్రోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి, ఈ ప్రమాదంపై విచారణ చేపట్టారు.

క్రీస్తు జననం, మరణం, పునరుత్థానం అద్భుతాలే

● సీబీఎఫ్ డైరెక్టర్ జడ వసంతబాబు



జడ వసంతబాబును సత్కరిస్తున్న యువజన విభాగం కార్యకర్తలు

ప్యారీస్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): క్రీస్తు జననం, మరణం, పునరుత్థానం ఈ మూడు అద్భుతాలేనని, క్రైస్తవులందరికీ సంతోషకరమైన ఘట్టాలేనని క్రిస్టియన్ బిలీవర్స్ ఫెలోషిప్ (సీబీఎఫ్) డైరెక్టర్ రెవరెండ్ డాక్టర్ జడ వసంతబాబు పేర్కొన్నారు. బ్రాడ్‌వే సెయింట్ గాబ్రియేల్ పాఠశాల ప్రాంగణంలో గుడ్‌ఫ్రైడే, ఈస్టర్‌లను పురస్కరించుకుని సీబీఎఫ్ యవ్వన బృందం నిర్వహించిన క్రీస్తు మరణ పునరుత్థాన మహోత్సవంలో జడ వసంతబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి సుధారమణి రచించిన అపారమైనది నీ కృప అనే పాటకు జడ జస్టిన్‌పాల్ సంగీతాన్ని సమకూర్చి పాడిన పాట ఆడియోను విశ్వ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి జడ విశ్వవాణి ఆవిష్కరించారు. రైట్ రెవరెండ్ రిక్టర్ ఆనంద్‌బాబు, జస్టిన్‌పాల్ సారథ్యంలో క్వయర్ పాడిన ప్రత్యేక పాటలు అలరించాయి.

నేడు ఈస్టర్

చర్చిల్లో వేకువజాము నుంచే ప్రార్థనలు

ప్యారీస్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మానవాళి శ్రేయస్సు కోసం శిలువపై మరణించిన యేసు క్రీస్తు మూడోరోజు పునరుత్థానుడైన ఘట్టాన్ని క్రైస్తవులు ఆదివారం ఈస్టర్‌గా జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. వేకువజామున 3 గంటలకు క్రీస్తు పునరుత్థాన దీపారాధన నిర్వహించేందుకు రాష్ట్రవ్యాప్తంగా వున్న చర్చిలు ప్రత్యేక అంశాలతో ముస్తాబయ్యాయి. నాగపట్టినం జిల్లాలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన వేలాంకన్ని మేరీమాత ఆలయం, తంజావూరు జిల్లా తిరుతురైపూండిలోని మేరీమాత ఆలయం, స్థానిక బిసెంట్‌నగర్ వేలాంకన్ని చర్చి, మైలాపూర్ శాంథోం చర్చి, ప్యారీస్ సెయింట్ ఆంథోని చర్చి, జెమిని సర్కిల్‌లోని కెథడ్రల్ చర్చి, ఎగ్మోర్ సేక్రేడ్ హార్ట్ చర్చి, వెపేరి హైరోడ్డులోని మద్రాస్ సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చి, పెరంబూరు కుక్కు రోడ్డులోని వాటర్‌బరి మెమోరియల్ తెలుగు బాప్టిస్ట్ చర్చి, ఆవడిలోని కల్వరి వర్షిప్ సెంటర్, విల్లివాక్కం రక్షణ సైన్యం సంఘం, అయినావరం రైల్వేకోర్టర్స్‌లోని సాల్వేషన్ ఆర్మీ చర్చి, న్యూ మోడల్ లైన్‌లోని సెయింట్ పీటర్ చర్చి, చూలై తెలుగు బాప్టిస్ట్ చర్చి, కాత్వాడ న్యూ లేబర్ లైను తెలుగు బాప్టిస్ట్ సంఘం, తిరుముల్లైవాయిల్‌లోని తెలుగు బాప్టిస్టు చర్చి, అంబత్తూరు క్యాథలిక్ చర్చి, కొరుక్కుపేట డాక్టర్ అంబేడ్కర్ నగర్ న్యూతెలుగు బాప్టిస్ట్ సంఘం, నరసింహనగర్, ఆంజనేయ నగర్, నజరేత్‌పురం, పల్లావరం, కెలీస్, పులియాన్‌తోపు, గణేష్‌పురం, ఎంకేబీ నగర్, నుంగంబాక్కం తదితర ప్రాంతాల్లోని చర్చిల్లో ఉదయం 10 గంటలకు, సాయంత్రం 6 గంటలకు పునరుత్థాన ఆరాధన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా, ఈస్టర్ పండుగ జరుపుకోనున్న క్రైస్తవులకు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో, టీఎంసీ అధ్యక్షుడు టీకే వాసన్, డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత విజయ్‌కాంత్ తదితర నేతలు శుభాకాంక్షలు తెలిపారు.

ద్రౌపది ఆలయం తెరిచినా.. కనిపించని భక్తులు!

పెరంబూర్,ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా మేల్‌పాది ద్రౌపది అమ్మవారి ఆలయంలో పూజల కోసం మూడో రోజైన శనివారం ఉదయం గుడిని తెరిచారు. కానీ, భక్తులు దర్శనానికి రాలేదు. మేల్‌పాది గ్రామంలోని ద్రౌపది అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించే విషయమై రెండు సామాజిక వర్గాల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. 2023 జూన్ 7వ తేది రెవెన్యూ అధికారులు ఆలయాన్ని సీజ్ చేశారు. ఈ వ్యవహారంపై దాఖలైన కేసును విచారించిన మద్రాసు హైకోర్టు, అన్ని సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు ఆలయానికి వెళ్లి పూజలు చేసేలా అనుమతిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. హైకోర్టు ఉత్తర్వులతో, గత గురువారం పూజల కోసం ఆలయాన్ని తెరిచారు. తొలిరోజు ఒక సామాజిక వర్గానికి చెందిన ప్రజలు ఆలయానికి వెళ్లి పూజలు చేసిన నేపథ్యంలో, రెండో వర్గానికి చెందిన సుమారు 60 మంది ప్రజలు పోలీసు భద్రత మధ్య అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పూజల అనంతరం ఆలయాన్ని మూసివేశారు. ఈ నేపథ్యంలో, తాము నిర్మించుకున్న ఆలయ పూజా హక్కులు అధికారులు ఎలా నిర్ణయిస్తారంటూ? ఒక సామాజిక వర్గం వారు నిలదీశారు.

దర్శనానికి రాని ప్రజలు...

రెవెన్యూ తహసీల్దార్ మురుగేశన్, ఏడీ ఎస్పీ దినకరన్ తదితర అధికారులు హిందూ దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో రెండో రోజైన శుక్రవారం ఉదయం 6 గంటలకు ఆలయ తలుపులు తెరిచారు. ఆలయ అర్చకులు మోహన్ పూజలు చేశారు. అనంతరం ఒక వర్గానికి చెందిన ప్రజలు వచ్చి దర్శించుకుంటారని అధికారులు భావించినా ఎవరూ రాలేదు. ముగ్గురు చిన్నారులు మాత్రమే వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం 7 గంటలకు ఆలయాన్ని మూసివేశారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఆలయాన్ని తెరచినా ప్రజలెవ్వరూ రాలేదు. ఈ క్రమంలో, సోంపట్టుకి చెందిన ఆరు కుటుంబాలు మేల్‌పాది ద్రౌపది అమ్మవారి ఆలయ దర్శనానికి వచ్చారు. కానీ, వారు ఆలయంలోకి వెళ్లకుండా రథం ఉండే ప్రాంతంలో పొంగళ్లు పెట్టి, అందరికి ప్రసాదం పంచిపెట్టి వెళ్లిపోయారు. మూడో శనివారం ఉదయం 6 గంటలకు ఆలయాన్ని తెరచి అధికారుల సమక్షంలో పూజారి పూజలు నిర్వహించినా, ఆలయ దర్శనానికి ఇరువర్గాలు హాజరుకాలేదు. 7 గంటలకు ఆలయాన్ని యథావిధిగా అధికారులు మూసివేశారు. ఈ విషయమై ఇరువర్గాలతో చర్చలు జరపాలని అధికారులు భావిస్తున్నారు.



ఆలయం వద్ద మోహరించిన పోలీసులు

పదవి నుంచి వైదొలగుతున్నా

● ఎండీఎంకే నేత దురై వైగో



దురై వైగో, మల్లై సత్య

ప్యారీస్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో రాజకీయ పార్టీలో ముసలం రేగింది. ఇప్పటికే తండ్రీకొడుకుల మధ్య రేగిన చిచ్చుతో 'పాట్టాలి మక్కల్ కట్చి' (పీఎంకే)లో గందరగోళం నెలకొనగా, తాజాగా ఎండీఎంకేలోనూ ఇదే తరహా ముసలం రేగింది. ఆ పార్టీ వ్యవస్థాపకుడు, రాజ్యసభ సభ్యుడు వైగో కుమారుడైన ఎండీఎంకే ముఖ్య కార్యదర్శి దురై వైగో కూడా తన పదవి నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించారు. ఎండీఎంకే సీనియర్ నేత మల్లై సత్య తీరు నచ్చకే ఈ పదవి నుంచి తప్పుకుంటున్నట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు దురై శనివారం ప్రకటన విడుదల చేశారు. పార్టీ అధినేత వైగో కీర్తి ప్రతిష్ఠలకు భంగం కలిగించే విధంగా, పార్టీని చీల్చే దిశగా మల్లైసత్య వ్యవహరిస్తుండడంతో పార్టీ ప్రతిష్ఠ దిగజారుతోందని ఆరోపించారు. మల్లై సత్య పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడటాన్ని సహించలేకే తాను పార్టీ పదవినుంచి తప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని అవమానాలు ఎదురైనా నాలుగేళ్లుగా తనకు అప్పగించిన బాధ్యతలను నిర్వహించినట్లు తెలిపారు. అయినా మల్లై సత్య దారుణాలు కొనసాగుతున్నాయని, అందువల్ల అవి చూసి కూడా పార్టీ పదవిలో కొనసాగేందుకు మనసు అంగీకరించడం లేదన్నారు. ఆదివారం జరగనున్న నిర్వాహక కమిటీ సమావేశంలో తాను తప్పకుండా పాల్గొంటానని, ఆ తర్వాత పార్టీ అధిష్ఠానం తీసుకునే కీలక నిర్ణయాలపై ఎలాంటి జోక్యం చేసుకోబోనన్నారు. పార్టీ అభివృద్ధిని అడ్డుకునేందుకు కొన్ని శక్తులు కుట్రపన్నాయని, అయినా పార్టీ ప్రధాన కార్యదర్శి తన తండ్రి వైగో పార్టీ పేరు ప్రతిష్ఠలకు భంగం వాటిల్లకుండా ముందుకు నడిపిస్తున్నారని తెలిపారు. తిరుచ్చి నియోజకవర్గ ప్రజలు గత లోక్‌సభ ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపించి పార్లమెంటుకు పంపించారని, వారికి తాను రుణపడి ఉంటానన్నారు. తన నియోజకవర్గంలో సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా పనిబ చేస్తున్నానన్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు ఏడేళ్లుగా తాను చేసిన ప్రయత్నాలను పార్టీ ప్రధాన నిర్వాహకులు మునుముందు కూడా కొనసాగించాలని దురై వైగో విజ్ఞప్తి చేశారు.

వెల్లియంగిరికి పోటెత్తిన భక్తులు



చెన్నై, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా పూండి సమీపంలో దక్షిణ కైలాసంగా పేరుగడించిన వెల్లియంగిరి పర్వతాలయానికి భక్తులు పోటెత్తారు. గుడ్‌ఫ్రైడేతోపాటు వరుసగా మూడు రోజులు సెలవుదినాలు కావటంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్త లు వెల్లియంగిరి స్వామివారిని దర్శించేందుకు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆరు కొండలు దాటిన తర్వాత వచ్చే ఏడో కొండపై స్వామివారు స్వయంభువుగా వెలసి భక్తులకు దివ్యదర్శనమిస్తున్నారు. భక్తులను ఫిబ్రవరి నుంచి మే నెలాఖరు వరకు కొండపైకి అనుమతిస్తారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, కేరళ నుంచి కూడా భక్తులు తరలివ స్తున్నారు. శుక్రవారం వేకువజాము నుండే వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి కొండెక్కి స్వామివారిని దర్శించుకున్నారు. సూర్యదర్శనం ముగించుకుని ఫలహారం వేదికపై ప్రసాదాలు ఆరగించి దిగువకు పయనమయ్యారు. భక్తులను, వారి లగేజీలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన మీదటే కొండెక్కటానికి అనుమతిస్తున్నారు.

ఓ భక్తుడి మృతి...

ఇదిలా ఉండగా తూత్తుకుడికి చెందిన భువనేశ్వరన్ (18) అనే యువకుడు స్వామివారి దర్శనం చేసుకుని కొండదిగుతూ కాలుజారి 10 అడుగుల లోతు గోతిలో పడి తీవ్రగాయాలకు గురై ఆ స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు.

ఏనుగు సంచారం...

ఇక రెండు రోజులకు ముందు కొండ దిగువన ఓ ఏనుగు రాత్రిపూట సంచరించి అక్కడున్న ప్రసాదాలు అమ్మే దుకాణాన్ని ధ్వంసంచేసి, బియ్యాన్ని ఆరగించి బయలుదేరింది. భక్తులు బిగ్గరగా కేకలు పెట్టడంతో ఆ ఏనుగు అడవిలోకి పరుగులు తీసింది. అటవీ శాఖ అధికారులు ఆ ప్రాంతంలో నిఘా ఏర్పాటు చేశారు.

వచ్చే ఎన్నికల్లో డీఎంకేకు ఓటమి తప్పదు

● కేంద్రమంత్రి ఎల్.మురుగన్



మీడియాతో మాట్లాడుతున్న మురుగన్

ప్యారీస్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు అసెంబ్లీకి 2026లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో డీఎంకే కూటమి చిత్తుగా ఓడిపోతుందని కేంద్ర మంత్రి, బీజేపీ నేత ఎల్.మురుగన్ పేర్కొన్నారు. నామక్కల్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... నీట్ వ్యవహారంలో డీఎంకే ఓటు బ్యాంకు కోసం రాజకీయం చేసిందే కానీ, మినహాయింపుకు ఎలాంటి ప్రయత్నాలు ఇప్పటివరకు చేయలేదన్నారు. డీఎంకే - కాంగ్రెస్ కూటమి కేంద్రంలో అధికారంలో ఉన్న సమయంలోనే నీట్‌ను ప్రవేశపెట్టారని, దీన్ని చట్టంగా తీసుకొచ్చేందుకు అప్పటి డీఎంకే మంత్రులు సహకరించారన్నారు. అయితే ఈ చరిత్రను మరుగున పరచి కాంగ్రెస్, డీఎంకేలు విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నాయన్నారు. మధ్యప్రదేశ్, బీహార్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో డబుల్ ఇంజిన్ సర్కార్లతో అభివృద్ధి వైపు పయనిస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించి అవినీతిపరులను ప్రోత్సహిస్తోందన్నారు. అందువల్లే కేంద్రప్రభుత్వంతో ఘర్షణలకు పాల్పడుతోందని వ్యాఖ్యానించారు. బీజేపీ - అన్నాడీఎంకేల కూటమిలో మరికొన్ని పార్టీలు చేరే అవకాశముందన్నారు.

30వరకు గ్రూప్-1 దరఖాస్తుల స్వీకరణ

పెరంబూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పరీక్షల దరఖాస్తుల సమర్పణకు ఈనెల 30వ తేదీ చివరి అవకాశమని టీఎన్‌పీఎస్సీ తెలిపింది. 28 సబ్ కలెక్టర్లు, ఏడు డీఎస్పీ, 19 వాణిజ్య పన్నుల అసిస్టెంట్ కమిషనర్ సహా 70 ఖాళీ పోస్టుల భర్తీకి నిర్వహించనున్న గ్రూప్-1 నోటిఫికేషన్ ఈనెల 1వ తేది విడుదలైంది. ఈ పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రిలిమినరీ పరీక్ష జూన్ 15వ తేది జరగనుంది.

అక్రమ భవనాల కూల్చివేతకు ఆదేశం



కరికట్టుకుప్పం తీరంలోని భవనాలను 15 రోజుల్లోగా కూల్చి వేయాలంటూ అధికారులు అంటించిన నోటీసులు

వాషర్‌మెన్‌పేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ముట్టుక్కాడు తీరం వెంబడి చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చి వేయాల్సిందిగా చెంగల్పట్టు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రముఖ పర్యాటక స్థలమైన ముట్టుక్కాడు తీర ప్రాంతంలోని కరికట్టుకుప్పంలో నిబంధనలను ఉల్లంఘిస్తూ భవనాలను నిర్మించారు. దీనికి ముట్టుక్కాడు మత్స్యకారులు, పర్యావరణ ప్రియులు తీవ్ర వ్యతిరేకించారు. ఆక్రమణదారులకు స్థానిక రాజకీయ నాయకులు, కొంతమంది ప్రభుత్వ అధికారులు అండగా ఉన్నారంటూ పలు పత్రికలు దుమ్మెత్తి పోశాయి. దీంతో జిల్లా అధికారులు దిగి రావాల్సి వచ్చింది. ఈ నిర్మాణాలను వెంటనే ఆపి వేయాల్సిందిగా చెంగల్పట్టు జిల్లా కలెక్టర్ అరుణ్‌రాజ్ నోటీసులు జారీ చేశారు. ఆ నోటీసులను అధికారులు సంబంధిత భవనాలకు అంటించారు. 15 రోజుల్లో నిర్మాణాలను తొలగించకపోతే, అధికారులే తొలగించి దానికైన ఖర్చును సంబంధిత వ్యక్తుల నుంచి వసూలు చేస్తారని పేర్కొన్నారు. నాన్ డెవలప్‌మెంట్ జోన్ (ఎన్‌డిజెడ్)లో భవన నిర్మాణాలకు ప్రభుత్వం అనుమతివ్వదని అధికారులు స్పష్టం చేశారు. 2024 జూలైలో కోస్తా ఉద్యమకారుడు కె. శరవణన్ దీనిపై పోరాటాలు ప్రారంభించడం గమనార్హం.

డీఎంకే లాయర్‌ని బెదిరించిన ఏడుగురి అరెస్ట్

ప్యారీస్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరుంబాక్కంలో డీఎంకే లాయర్ ఇళయరాజాను బెదిరించిన 16 ఏళ్ల బాలుడు సహా ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. అరుంబాక్కం పుహళేంది నగర్ ప్రాంతానికి చెందిన ఇళయరాజాను అదే ప్రాంతానికి చెందిన మిత్రుల బృందం మధ్య ఏర్పడిన విభేదాల కారణంగా శుక్రవారం రాత్రి కత్తులు చూపి బెదిరించడం గమనించిన స్థానికులు ఆ ముఠాను అక్కడినుండి తరిమికొట్టారు. దీనిపై ఇళయరాజా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు బాలుడు(16), రాహుల్, వినోద్‌కుమార్, ఢిల్లీబాబు సహా మొత్తం ఏడుగురిని శనివారం ఉదయం అరెస్టు చేశారు.

నటి ఖుష్బూ 'ఎక్స్' పేజీ హ్యాక్

పెరంబూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకురాలు, నటి ఖుష్బూ ఎక్స్ పేజీ హ్యాక్ అయినట్టు సమాచారం. ప్రకటనలు, ప్రస్తుత రాజకీయాలపై నటి ఖుష్బూ తన ఎక్స్ పేజీలో పోస్ట్ చేస్తుంటారు. ఈ నేపథ్యంలో, శనివారం తన ఎక్స్ పేజీ హ్యాక్‌కు గురైందని, 9 గంటల నుంచి తాను లాగిన్ చేసేందుకు యత్నిస్తే వీలుకావడం లేదని తెలిపిన ఖుష్బూ, ఎక్స్ పేజీ సరిచేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కాగా, గతంలో ఒకటి, రెండు సార్లు తన ఎక్స్ పేజీ హ్యాక్‌కు గురైందని ఖుష్బూ సమాచార విభాగానికి ఫిర్యాదు చేశారు.

షోళింగర్ పర్వతాలయానికి నాలుగు రోజులు రోప్‌కార్ సేవల రద్దు



చెన్నై, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రాణిపేట జిల్లా షోళింగర్ యోగనరసింహస్వామి పర్వతాలయానికి నడుపుతున్న రోప్‌కార్ సేవలను ఈనెల 21 నుంచి 24 వరకు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. అష్టోత్తర శత వైష్ణవ దివ్యదేశాల్లో ఒకటైన ఈ ఆలయం 750 అడుగుల ఎత్తు కలిగిన పర్వత శిఖరాగ్రంపై కొలువు దీరి ఉంది. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు 1305 మెట్లు కలిగిన కాలినడక దారిలో వెళుతుండేవారు. ఈ మెట్ల దారిలో వెళ్లటానికి వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతుండేవారు. దీంతో దేవాదాయ శాఖ రోప్‌కార్ సేవలను ఏర్పాటు చేసింది. ఈ రోప్‌కార్‌ను మూడు నెలలకోసారి మరమ్మతులు చేయడం ఆనవాయితీ. ఆ మేరకు ఈనెల 21నుంచి ఈ రోప్‌కార్‌ను మరమ్మతులు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు.

విద్యుదాఘాతానికి గురైన బాలుడు

రక్షించిన యువకుడు



బాలుడిని రక్షిస్తున్న దృశ్యాలు

పెరంబూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వరద నీటిలో కాలు పెట్టి విద్యుదాఘాతానికి గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాలుడిని ప్రాణాలకు తెగించి రక్షించిన యువకుడిని పలువురు అభినందించారు. అరుంబాక్కం ఉత్తాచ్చిఅమ్మన్ ఆలయ ప్రాంతానికి చెందిన రాబర్ట్ కుమారుడు సెడన్‌రాయన్ (9) ఆ ప్రాంతంలోని ప్రైవేటు పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 16న పాఠశాల నుంచి బాలుడు ఇంటికి వెళుతున్న సమయంలో, అరుంబాక్కం మంగళనగర్ 1వ వీధిలో నిలిచిన వరద నీటిలో కాలు వేసిన సమయంలో విద్యుదాఘాతానికి గురైనాడు. గమనించిన అదే ప్రాంతానికి చెందిన కన్నన్ బాలుడిని రక్షించి ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సకాలంలో తీసుకురావడంతో బాలుడి ప్రాణాలు కాపాడగలిగామని వైద్యులు తెలిపారు. కాగా, ప్రాణాలకు తెగించి బాలుడిని రక్షించిన కన్నన్‌ను బాలుడి కుటుంబ సభ్యులు, బంధువులు, వైద్యులు, పోలీసులు అభినందించారు. కాగా, బాలుడిని కన్నన్ రక్షించే దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి.

అన్నాడీఎంకే కూటమి నుంచి వైదొలిగిన ఎస్డీపీఐ

పెరంబూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే కూటమి నుంచి వైదొలుగుతున్నట్లు ఎస్డీపీఐ ప్రధాన కార్యదర్శి అబూబకర్ సిద్ధిక్ ప్రకటించారు. బీజేపీతో కూటమితో కలిసే ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోమన్నారు. బీజేపీతో పొత్తుపెట్టుకున్న పార్టీలన్నీ నాశనమయ్యాయని, ప్రస్తుతం తమ పార్టీ ఏ రాజకీయ పార్టీతో పొత్తు పెట్టుకోవడం లేదని అబూబకర్ తెలిపారు.



వేలూరు మానగర డీఎంకే 30వ వార్డు తరపున ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కార్తికేయన్ (చిత్రంలో) స్థానిక కౌన్సిలర్ మురుగన్, మేయర్ సుజాత ఆనందకుమార్, మాజీ ఎంపీ మహమ్మద్ సఖీ తదితరులు

వేడుకగా సన్‌బీం పాఠశాల వార్షికోత్సవం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు, నిర్వాహకులు

వేలూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడిలోని సన్‌బీం సీబీఎస్ఈ పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం రాత్రి జరిగింది. సన్‌బీం విద్యాసంస్థల అధ్యక్షుడు డాక్టర్ హరిగోపాలన్ అధ్యక్షత జరిగిన వేడుకలకు ముఖ్యఅతిథిగా ఆక్సీలియం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆరోగ్య జయశీలి, ప్రభుత్వ వైద్యుడ రవిచంద్రన్ హాజరయ్యారు. వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన వివిధ క్రీడా పోటీల విజేతలకు ముఖ్యఅతిథులు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ తంగప్రకాష్, ఉపాధ్యక్షుడు జార్జి అరవిందన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపు ఉత్తర్వులు



లబ్ధిదారులకు కేటాయింపు ఉత్తర్వులు అందిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు

వేలూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఆనైకట్టు, వేలూరు, కనియంబాడి పంచాయతీలకు చెందిన 863 మంది లబ్ధిదారులకు 'కలైంజర్ కణవు ఇల్లం' పథకంలో ఇళ్ల కేటాయింపు ఉత్తర్వులను కలెక్టర్ సుబ్బులక్ష్మి అందజేశారు. తెల్లూరులోని ప్రైవేటు కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ... కలైంజర్ కణవు ఇల్లం పథకంలో జిల్లాకు 4,250 గృహాలు మంజూరయ్యాయన్నారు. గత ఏడాది కేటాయించిన 2,700 గృహాల్లో 930 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, మిగిలినవి తుది దశలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అనైకట్టు ఎమ్మెల్యే నందకుమార్, జిల్లా పంచాయతి కమిటీ సభ్యుడు, యూనియన్ కమిటీ అధ్యక్షురాలు అముద జ్ఞానశేఖరన్ జిల్లా పంచాయతీల కమిటీ అధ్యక్షుడు బాబు, గ్రామీణాభివృద్ధి పథక డైరెక్టర్ సెందిల్‌కుమార్, పంచాయతీల అసిస్టెంట్ డైరెక్టర్ తిరుమాల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



తమీమ్ దావూద్ (ఫైల్‌ఫొటో)

వేలూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. తమీమ్ దావూద్ (71) ద్విచక్రవాహనంపై సేన్‌పాక్కం రైల్వే వంతెనపై వెళుతుండగా అదుపుతప్పి పిట్టగోడను ఢీకొని కిందపడి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వంతెన గోడ తక్కువ ఎత్తులో ఉండడంతో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు కలెక్టర్‌కు తెలిపారు.

నుంగంబాక్కంలో ట్యాంకర్ లారీ బోల్తా


● 3 గంటలు స్తంభించిన ట్రాఫిక్



నుంగంబాక్కం కాలేజీ రోడ్డులో బోల్తాపడిన ట్యాంకర్

ప్యారీస్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక నుంగంబాక్కం కాలేజీ రోడ్డులోని ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం ఎదుట ట్యాంకర్ లారీ బోల్తా పడింది. సిమెంట్ మిక్స్‌చర్ లారీని క్రేన్ సాయంతో తొలగించేందుకు సుమారు మూడు గంటల సమయం పట్టింది. అందువల్ల ఆ మార్గంలో వాహనాల రాకపోకలు స్తంభించాయి. ప్రాంతీయ వాతావరణ కేంద్రం సమీపంలో ఉదయం 6.30 గంటలకు వేగంగా వచ్చిన ట్యాంకర్ లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు. ఇదిలా ఉండగా, ఆ లారీ రోడ్డుపై బోల్తాపడిన సమయంలో ఆ ప్రాంతంలో ద్విచక్రవాహనాలు, ఆటోలు, ఇతర వాహనాలు లేకపోవడంతో ప్రాణ నష్టం జరగలేదు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి ఎక్స్‌కవేటర్, క్రేన్‌తో చేరుకున్నారు. మూడు గంటలపాటు శ్రమించి ట్యాంకర్‌ను పక్కకు తొలగించారు. కోయంబేడు సమీపంలోని మధురవాయల్ నుంచి హార్బర్ వరకు స్తంభాలపై ఫ్లైఓవర్ నిర్మించే పథకం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎగ్మోర్‌లో జరుగుతున్న నిర్మాణం పనులకు సిమెంట్ మిశ్రమాన్ని లోడ్ చేసుకుని బయలుదేరిన ట్యాంకర్ ట్యాంకర్... నుంగంబాక్కం వాతావరణ పరిశోధన కేంద్రం జంక్షన్‌కు చేరుకున్న సమయంలో ప్రమాదంలో చిక్కుకుంది. బోల్తాపడిన లారీలో సుమారు 11 టన్నుల బరువుగల సిమెంట్ మిశ్రమం కూడా ఉంది. అందువల్లే ఆ లారీని అక్కడినుండి తొలగించడానికి మూడు గంటల సమయం పట్టిందని పోలీసులు తెలిపారు.

మా నీటి కష్టాలు తీర్చండి!




బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు


తిరుత్తణి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): తమ తాగునీటి కష్టాలు తీర్చాలంటూ శనివారం ఉదయం తిరుత్తణి సమీపంలోని పెరియకదంబూరులో మహిళలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామంలో సుమారు 150 కుటుంబాలు నివసిస్తున్నాయని, వేసవి సమీపించిన నేపథ్యంలో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నామన్నారు. దీనికి తోడు ఊరికి సమీప ప్రాంతాల్లోని కూల్‌డ్రింక్స్ తయారు చేస్తున్న పలు కంపెనీలు, బోర్లు వేసి నీరు మొత్తం తోడేస్తున్నాయన్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. వెంటనే దీనిపై చర్యలు తీసుకోకుంటే నిరసనను విరమించబోమని రోడ్లపైకి వచ్చి బిందెలతో నిరసన తెలియజేశారు. దీంతో ఆ ఆ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని అధికారులతో చర్చించి సమస్యకు పరిష్కారం చూపతామన్న హామీతో గ్రామస్తులు నిరసనను విరమించారు.

అన్ని హంగులతో

వెట్‌లాండ్ గ్రీన్‌పార్కు







SUNDAY SPECIAL

చెన్నై, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వేసవి వచ్చిందంటే చాలు నగరవాసులు మెరీనాబీచ్ సహా సముద్రతీర ప్రాంతాల్లో, నగరంలోని కీలక ప్రాంతాల్లో ఉన్న ఉద్యానవనాల్లో సేద తీరటానికి ఆసక్తి కనబరుస్తారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ నిర్వహిస్తున్న ఉద్యానవనాలలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించడానికి నగరవాసులు పిల్లాపాపలతో బారులు తీరుతున్నారు. నగరంలోని టి.నగర్ నటేశన్ పార్కు, చింతాద్రిపేటలోని మేడే పార్కు, పెరంబూరు ఫ్లైఓవర్ సమీపంలో ఉన్న మురసొలి మారన్ పార్కు, అన్నాసాలై జెమినీ బ్రిడ్జికి కూతవేటు దూరంలో ఉన్న సెమ్మొళి పూంగా, చెట్‌పట్ ఎకో పార్కు, చిల్డ్రన్స్ పార్కు, తొల్‌కాప్పియ పూంగా, శివన్ పార్కు (కేకేనగర్), పానగల్ పార్కు అంటూ ఎన్నో ఉద్యానవనాలు నగరవాసులను ప్రత్యేకించి చిన్నారులను ఆకట్టుకుంటున్నాయి. ఈ కారణంగానే చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఎండీఏ) పోరూరు తడి భూముల్లో నిర్మించిన హరిత ఉద్యానవనం నగరవాసులను ప్రత్యేకించి పోరూరు, వలసరవాక్కం, నందంబాక్కంవాసులను ఆకట్టుకుంటోంది. రూ.12.60 కోట్లతో అన్ని హంగులతో నిర్మించిన ఈ ఉద్యానవనాన్ని సీఎం స్టాలిన్ ఇటీవలే ప్రారంభించారు. ఈ ఉద్యానవనానికి ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ పేరు పెట్టడం అన్ని విధాలా సమంజసంగా ఉంటుంది. జీవిత పర్యంతమూ పచ్చదనాన్ని కోరుకున్న ఆ శాస్త్రవేత్త కీర్తిని ఎలుగెత్తే చాటేలా ఈ ఉద్యానవనం అంతటా పచ్చదనంతో కళకళలాడుతోంది. ఈ ఉద్యానవనంలో 103 మంది కూర్చుకునేందుకు వీలుగా సిమెంట్ బల్లులు ఏర్పాటు చేశారు. 560 మీటర్ల పొడవున కలప ప్లాస్టిక్ మిశ్రమం (డబ్ల్యూపీసీ)తో కూడిన నడకదారి వంతెన, 282 మీటర్ల పొడవు ఇటుకలతో ఏర్పాటైన కాలినడక రహదారి, 126 మీటర్ల పొడవు నల్ల రాళ్లతో ఏర్పాటైన కాలినడక నిర్మించారు. బాస్కెట్ బాల్ కోర్టు, మల్టీపర్పస్ ప్లే గ్రౌండ్, 6.85 ఎకరాల్లో సరస్సు, ఓపెన్ ఎయిర్ జిమ్నాజియం కూడా నిర్మించారు. పార్కింగ్, రెస్టరూ సదుపాయాలున్నాయి. ప్రస్తుతం ఈ ఉద్యానవనంలో అడుగుపెట్టే నగరవాసులు తామేదో విదేశీ ఉద్యానవనంలో సంచరిస్తున్నట్లు కొత్త అనుభూతికి గురవుతున్నారని చెప్పటం అతిశయోక్తి కాదు. ఉద్యానవనంలోని సరస్సును తిలకించడానికి కలప, ప్లాస్టిక్ మిశ్రమంతో రూపొందించిన కాలినడక వంతెన కూడా ఉంది. ఆ వంతెనపై వెళుతుంటే వివిధ రకాల పక్షులు పలకరిస్తాయి. అదే విధంగా సరస్సులో బాతుల సంచారం కూడా కనువిందు చేస్తుంది. వారం రోజులుగా ఈ పార్కును సందర్శించేందుకు నగరవాసులు వేల సంఖ్యలో బారులు తీరుతుండటం విశేషం. ప్రస్తుతం ఈ ఉద్యానవనం నగరంలో ప్రముఖ పర్యాటక ప్రాంతంగా మారింది..









ఆ ఇద్దరు దర్శకులకు పాదాభివందనం : శివకుమార్

● అవకాశాలు వస్తే చేజార్చుకోవద్దు : సూర్య ● గ్రాండ్‌గా 'రెట్రో' ట్రైలర్ రిలీజ్ వేడుక

సూర్యను హీరోగా తొలిసారి వెండితెరకు పరిచయం చేసిన దర్శకులు మణిరత్నం, వసంత్‌కు పాదాభివందనం చేస్తున్నట్టు సీనియర్ నటుడు శివకుమార్ అన్నారు. కార్తిక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో హీరో సూర్య నటించిన 45వ చిత్రం 'రెట్రో'. 2డీ ఎంటర్‌టైన్మెంట్, స్టోన్ బెంచ్ సంయుక్తంగా నిర్మించాయి. పూజా హెగ్డే హీరోయిన్. నాజర్, కరుణాకరన్, శ్వాసిక, జయరాం, జోజుజార్జ్ తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. సంతోష్ నారాయణన్ సంగీతం. మే 1న విడుదలకానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రం ఆడియో, ట్రైలర్ వేడుక శనివారం రాత్రి చెన్నైలో జరిగింది. ఇందులో సూర్య తండ్రి శివకుమార్ మాట్లాడుతూ... 'సూర్య చిత్రపరిశ్రమలోనే రాణిస్తారని ఓ జోతిష్యుడు చెప్పారు. ఆయన మాటలు నమ్మి చిత్రపరిశ్రమలో ఓసారి ప్రయత్నించాం. మణిరత్నం నిర్మాతగా, వసంత్ దర్శకత్వం వహించిన 'నేరుక్కు నేర్' సినిమా కోసం లుక్ టెస్ట్‌కు వెళ్లడం, అందులో నటించడం, ఆ చిత్రం విడుదలై విజయం సాధించడం అంతా ఓ కలలా సాగిపోయింది. అలాగే, సూర్యను డైరెక్ట్ చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు. హీరో సూర్య మాట్లాడుతూ... 'నేను పరిశ్రమలోకి అడుగుపెట్టి 25 యేళ్ల గడిచిపోయాయి. ఎల్లవేళలా అభిమానుల ప్రేమాభిమానాలు ఉంటే నేను బాగుంటా. జీవింతం ఎంతో అందమైనది. మీ జీవితంపై నమ్మకం పెట్టుకోండి. ఎన్నో అద్భుతాలు జరుగుతాయి. అవకాశాలు వచ్చినపుడు చేజార్చుకోవద్దు. ప్రతి ఒక్కరికీ ఒకేసారి అవకాశం వస్తుంది. దాన్ని సద్వినియోగం చేసుకుంటే ప్రతి ఒక్కరి జీవితంలో విజయం ఉంటుంది' అని అన్నారు. అలాగే, దర్శకుడు దర్శకుడు కార్తిక్ సుబ్బరాజ్, సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్, హీరోయిన్ పూజా హెగ్డే తదితరులు ప్రసంగించారు. కాగా, ఈ చిత్రం ట్రైలర్ సూర్య అభిమానులను అమితంగా ఆకర్షిస్తోంది. ఇందులోని సన్నివేశాలు, సంగీతంతో కొన్ని కీలక సన్నివేశాలతో ట్రైలర్‌ను కట్ చేశారు. అలాగే, ఇందులో లవ్ డీటాక్స్ అనే పాటను గాయని శ్రేయతో కలిసి హీరో సూర్య నేపథ్యగానం చేశారు. ఇప్పటికే సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని యూఏ సర్టిఫికేట్‌ను పొందింది. సినిమా నిడివి 2 గంటలా 48 నిమిషాలా 30 సెకన్లు ఉందని మేకర్స్ వెల్లడించారు.



'రెట్రో' ఆడియో విడుదుల

కనుల పండువగా పార్థసారథి పెరుమాళ్ రథోత్సవం



ప్యారీస్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రిప్లికేన్‌లోని పార్థసారధి పెరుమాళ్ రథోత్సవం శనివారం కన్నుల పండువగా జరిగింది. దేశంలోని 108 వైష్ణవ దివ్యక్షేత్రాల్లో ఒకటైన పార్థసారధి పెరుమాళ్‌కు చైత్రమాసంలో బ్రహ్మోత్సవం, పశ్చిమ దిశగా కొలువుదీరిన నరసింహ పెరుమాళ్‌కు శ్రావణ మాసంలో బ్రహ్మోత్సవాలను కోలాహలంగా నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది చైత్ర బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని పార్థసారధి పెరుమాళ్ ఆలయంలో శనివారం ఉదయం 6 గంటలకు ఆలయ అర్చకులు అభిషేక, అర్చన, అలంకార పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం బంగారు, వెండి ఆభరణాలు, పూలతో అందంగా అలంకరించిన ఉత్సవమూర్తి పార్థసారధి పెరుమాళ్‌ను రథంపై ఆశీనులను చేశారు. వేలాదిమంది భక్తుల గోవిందనామస్మరణ, మేళతాళాలు, వేదమంత్రోచ్చారణల నడుమ రథోత్సవం నాలుగు మాడవీధుల గుండా సాగింది.

వ్యక్తిగతంగా కష్టకాలం

● నస్రియా

చిత్రజ్యోతి



గత కొన్ని రోజులుగా వ్యక్తిగతంగా అనేక సమస్యలను ఎదుర్కొన్నానని, అందువల్లే కొంతకాలంగా మీడియా ముందుకు రాలేదని ప్రముఖ మలయాళ నటుడు ఫహద్ ఫాజిల్ సతీమణి నస్రియా అన్నారు. 'నేరమ్', 'రాజారాణి', 'నయ్యాండి', 'తిరుమణం ఎన్నుం నిఖా' వంటి అనేక చిత్రాల్లో ఆమె నటించారు. మలయాళం నటుడు ఫహద్ ఫాజిల్‌ను పెళ్లి చేసుకున్న ఆమె... ఒకవైపు సినిమాలు, ప్రజాసేవ ఇలా అనేక రకాలుగా ఆమె రాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేశారు. అందులో 'నేను కొన్ని రోజులుగా బాహ్య ప్రపంచంలో ఎందుకు కనిపించలేదో చెప్పదలచుకున్నా. సినిమాతో పాటు ఇతరులతో కూడా టచ్‌లోనే ఉన్నా. కానీ, కొన్ని నెలలుగా శారీరకంగా, మానసికంగా, వ్యక్తిగతంగా అనేక సమస్యలను ఎదుర్కొన్నా. నా 30వ బర్త్‌డే సెలెబ్రేషన్స్, మలయాళ కొత్త సంవత్సరాది, నేను నటించిన 'సూక్ష్మదర్శిని' చిత్ర విజయోత్సవాలను జరుపుకోలేకపోయా. ఏ ఒక్కరి మొబైల్ ఫోన్ కాల్ లేదా మెసేజ్‌కు స్పందించలేదు. ఇందుకోసం క్షమాపణలు కోరుతున్నా. కష్టకాలం నుంచి మళ్లీ గట్టెక్కుతున్నా. పూర్తిగా కోలుకునేందుకు మరికొంత సమయం పడుతుంది' అని పేర్కొన్నారు.



'గరం మసాల'లో ఓ దృశ్యం

విమల్ - యోగిబాబుల 'గరం మసాల'

తమిళన్ మజీద్ దర్శకత్వంలో విమల్, యోగిబాబు ప్రధాన పాత్రలను పోషించిన చిత్రం 'గరం మసాల'. పూర్తిస్థాయి హాస్యభరిత చిత్రం. చంపికా డయానా హీరోయిన్. ఇతర పాత్రల్లో ఎంఎస్ భాస్కర్, రవి మరియా, మొట్టై రాజేంద్రన్, జాన్ విజయ్, చామ్స్, నమో నారాయణన్, జ్ఞానసంబంధం తదితరులు నటించారు. చిత్రీకరణ పనులు పూర్తి చేసుకుని నిర్మాణాంతర కార్యక్రమాలను జరుపుకుంటోంది. ఇప్పటికే విడుదల చేసిన ఈ మూవీ ఫస్ట్‌లుక్‌కు మంచి స్పందన వచ్చింది. ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ... 'ఆధునిక ప్రపంచంలో ప్రతి ఒక్కరి జీవితాలు కొందరి మధ్యవర్తులతో ముడిపడి ఉంటాయి. ఉదాహరణకు గృహ నిర్మాణం, వివాహం, వ్యాపారం తదితర అంశాల్లో మధ్యవర్తులు కీలక భూమికను పోషిస్తారు. ఆ బ్రోకర్ల వల్ల ఉత్పన్నమయ్యే మంచి, చెడు సంఘటనల మిశ్రమమే ఈ సినిమా స్టోరీ' అని పేర్కొన్నారు.

జేఈఈ టాపర్లకు నగదు బహుమతి



టాపర్లకు నగదు బహుమతి అందిస్తున్న నారాయణ చెన్నై విద్యా సంస్థల నిర్వాహకులు

వాషర్‌మెన్‌పేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తమిళనాడు టాపర్‌గా నారాయణ చెన్నై విద్యా సంస్థలకు చెందిన ప్రదీష్ గాంధీ నిలిచినట్టు ఏజీఎం శిల్ప పేర్కొన్నారు. జేఈఈ ఫలితాలు శుక్రవారం విడుదలైన విషయం తెలిసిందే. జాతీయస్థాయిలో ఓపెన్ కేటగిరీలో 36వ ర్యాంకు సాధించిన ప్రదీష్‌గాంధీ రాష్ట్ర స్థాయిలో టాపర్‌గా నిలిచాడు. అతనితో పాటు జనవరి సెషన్‌లో రాష్ట్రస్థాయి మొదటిర్యాంకు సాధించిన తమ విద్యార్థి సన్నీ యాదవ్‌కు నారాయణ చెన్నై విద్యా సంస్థల నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించి, చెరో రూ.లక్ష నగదు బహుమతిని అందించారు. స్థానిక గోపాలపురంలోని నారాయణ పాఠశాలలో శనివారం సాయంత్రం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యా సంస్థల డీజీఎం అనిల్, ఏజీఎం శిల్ప, అకడమిక్ కోర్ డీన్ శివరామకష్ణ, అకడమిక్ హెడ్ సంయుక్త తదితరులు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి నగదు బహుమతిని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఓపెన్ కేటగిరీలో 1000లోపు 8 ర్యాంకులు, 2000 లోపు 12, 5000 లోపు 18, 10000 లోపు 24, 20000 లోపు 34, 30000 లోపు 49, 50000 లోపు 68 ర్యాంకులను తమ విద్యార్థులు సాధించినట్లు వివరించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మేయర్ ప్రియ

అడయార్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని చెన్నై మేయర్ ప్రియ పిలుపునిచ్చారు. రోటరీ డిస్ట్రిక్ట్ 3233 ఆధ్వర్యంలో కోయంబేడులోని సెయింట్ థామస్ కళాశాల ఆడిటోరియంలో 'గోల్డన్ స్పారో' పేరుతో శనివారం 'మహిళా కార్నివాల్' నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన మేయర్ మాట్లాడుతూ... ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకుని మహిళలు అన్ని రంగాల్లో రాణించి, ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. సమాజ సేవల్లో రాణిస్తున్న అనేక మంది మహిళలు సాటి వారికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా పలు రంగాల్లో రాణిస్తున్న మహిళలకు పురస్కారాలు ప్రదానం చేశారు.



కార్యక్రమంలో అతిథులు, నిర్వాహకులు

ప్రపంచానికి శాంతిని బోధిస్తున్న భారత్

● 'వీఐటీ చెన్నై వర్శిటీ' కార్యక్రమంలో థాయ్‌లాండ్ దౌత్యాధికారి

పెరంబూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి భారత్ శాంతిని బోధిస్తోందని చెన్నైలోని థాయ్‌లాండ్ దౌత్య కార్యాలయ అధికారి రచా అరిబర్గ్ ప్రశంసించారు. వీఐటీ చెన్నై ప్రాంగణంలో శుక్రవారం 'మధ్యవర్తిత్వం' పోటీల ముగింపు వేడుకలు జరిగాయి. వేడుకలకు వర్శిటీ ఉపాధ్యక్షుడు జీవీ సెల్వం అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా హాజరైన రచా అరిబర్గ్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల థాయ్‌లాండ్‌లో జరిగిన బీఐఎంఎస్‌టీఈసీ సదస్సులో పాల్గొన్నారన్నారు. నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక, మయన్మార్, థాయ్‌లాండ్‌ల అభివృద్ధికి భారత్ భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. ఈ ప్రాంతాల్లో బలమైన ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదిగిందన్నారు. అన్ని దేశాల సంక్షేమం, అభివృద్ధి భారత్ కోరుకుంటోందన్నారు. జీవీ సెల్వం మాట్లాడుతూ... మధ్యవర్తిత్వం ప్రాచీనకాలం నుంచే ఉందని, మానవులు నాగరికులుగా మారిన నాటి నుంచే మధ్యవర్తిత్వం ప్రారంభమైందని చెప్పవచ్చన్నారు. రామాయణం, మహాభారతం తదితరాల్లో కూడా మధ్యవర్తిత్వం కన్పిస్తుందన్నారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో విచారణలో ఉన్న పలు కేసులు మధ్యవర్తిత్వంతోనే పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ వేడుకల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో తమిళనాడు, కర్ణాటక, కేరళ, పశ్చిమబెంగాల్ సహా 27 రాష్ట్రాలకు చెందిన 27 ప్రముఖ న్యాయ కళాశాలలకు చెందిన 104 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ముంబైలోని ప్రభుత్వ న్యాయ కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలువగా, ముఖ్యఅతిథి వారికి నగదు, జ్ఞాపికలు అందజేశారు.




విజేతలకు బహుమతులు అందజేస్తున్న థాయ్‌లాండ్ దౌత్యాధికారి రచా అరిబర్గ్, వీఐటీ ఉపాధ్యక్షులు జీవీ సెల్వం తదితరులు

ఉప రాష్ట్రపతితో గవర్నర్ భేటీ



ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గవర్నర్ ఆర్‌ఎన్ రవి

పెరంబూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్‌తో సమావేశమయ్యారు. రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులకు గవర్నర్ ఆమోదం తెలపని నేపథ్యంలో, ఈ విషయమై దాఖలైన కేసులో సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. బిల్లులను ఆమోదించేందుకు కాలం నిర్ణయించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న 10 బిల్లులను ఆమోదిస్తూ అత్యున్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. గవర్నర్ పంపించే బిల్లులపై మూడు నెలల్లో రాష్ట్రపతి ఆమోదం తెలపాలని, జాప్యం కలిగితే అందుకు తగిన కారణాలను రాష్ట్ర ప్రభుత్వానికి తెలుపాలని తీర్పులో పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఉపరాష్ట్రపతి ధన్‌కడ్... 'రాష్ట్రపతికే సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేస్తోందని, దేశంలో ఏం జరుగుతోంది' అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఉప రాష్ట్రపతి వ్యాఖ్యలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో, ఢిల్లీలో ఆయనతో గవర్నర్ రవి శనివారం సమావేశమయ్యారు. అనంతరం కేంద్ర న్యాయ శాఖ అధికారులను సంప్రదించి పలు సలహాలు, సూచనలు తీసుకున్నట్లు సమాచారం. ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు బెంచ్ వెలువరించిన తీర్పుపై అదనపు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనాన్ని అభ్యర్థించడం, సమీక్షా పిటిషన్ దాఖలు చేయడంపై గవర్నర్ న్యాయనిపుణులను సంప్రదిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.



1989కి ముందు

అడవుల్లో అవస్థల దారులు.. పల్లెలకు ఎద్దుల బండి బాటల వంటి డొంక దారులు.. నియోజకవర్గం మొత్తం రెండే రెండు హైస్కూళ్లు.. ఒక్కటే జూనియర్ కాలేజీ. ఆపై చదవాలంటే కర్ణాటకకు పరుగులు.. సజ్జ, రాగి సంగటే ఆహారం. వస్తు మార్పిడితోనే వ్యాపారం. ఆరెంపీలదే వైద్యం.. ఏ ఉద్యోగికైనా కుప్పం ఒక పనిష్మెంట్ ప్రాంతం.


...చంద్రబాబు తన రాజకీయ కార్యక్షేత్రంగా కుప్పం ప్రాంతాన్ని ఎంచుకునే నాటికి ఉన్న పరిస్థితి ఇది.

చంద్రబాబు వచ్చాక

ఎటునుంచి ఎటు వెళ్లాల్సి వచ్చినా సిమెంటు రోడ్లు.. ద్రావిడ విశ్వవిద్యాలయం, వైద్య, ఇంజనీరింగ్ కళాశాలలు, ప్రతి గ్రామంలో బడులు.. అత్యాధునిక వ్యవసాయ పద్ధతులతో లాభసాటిగా మారిన వ్యవసాయం.. బేకరీలు, హోటళ్లు.. కుప్పంలో ఆగి కదిలే రైళ్లు.. రెక్కలు విప్పుకోబోతున్న విమానాశ్రయం.. చల్లని ఈ ప్రాంతం ఇప్పుడు ఉద్యోగులకు స్వర్గధామం.

... ఇప్పటికి 8 సార్లు కుప్పం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన నారా చంద్రబాబు నాయుడు చేసి చూపిన అభివృద్ధి ఇది.





కుప్పం 75 ఏళ్ల చంద్రుడు

కుప్పం ఆంధ్రజ్యోతి





వ్యవసాయ విప్లవం

ఒకప్పుడు కుప్పం ప్రాంతంలో వర్షాధార వ్యవసాయమే సాగేది. సామలు, రాగులు లాంటి మెట్ట పంటలు వేసి ఆకాశంవైపు చూసే వారు రైతులు. వానలు కురిస్తే సరి, లేదంటే అప్పుల్లో మునిగిపోయే వారు. ఇటువంటి చోట.. ఇజ్రాయిల్ టెక్నాలజీతో వ్యవసాయంలో విప్లవం తీసుకొచ్చారు చంద్రబాబు. రామకుప్పం మండలం చెల్దిగాని పల్లె ఈ ప్రయోగాలకు వేదిక అయ్యింది. తక్కువ నీటితో అత్యధిక దిగుబడి సాధించడం ఇజ్రాయిల్ టెక్నాలజీతో సాధ్యం. సంప్రదాయ సాగుకే అలవాటు పడిన అప్పటి రైతులు తొలిరోజుల్లో ఆధునిక సాంకేతికతకు మొగ్గు చూపలేదు. ఫలితాలు చూశాక ఇప్పుడు ప్రతి రైతూ బిందు, తుంపర్ల సేద్యమే చేస్తున్నాడు. గ్రీన్ హౌస్‌లు ఏర్పాటు చేసుకున్నారు. ఇండో ఇజ్రాయిల్ భాగస్వామ్యంతో 22.8 ఎకరాల స్థలంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ, కూరగాయలు, పూలు)ను 2019లో రూ.9 కోట్ల వ్యయంతో కుప్పంలో ఏర్పాటు చేశారు.ఇక్కడ 19పాలీ హౌస్‌లు, ఒక ఫారం పాండ్, రెండు నీటి నిల్వ ట్యాంకులతోపాటు కోల్డ్ స్టోరేజీ రూము,విషింగ్,గ్రేడింగ్ యంత్రాలున్నాయి. ఉద్యాన రైతులకు ఎంతో ఉపయోగపడుతున్న సీవోఈకి గతేడాది ప్రతిష్ఠాత్మకమైన స్కోచ్ అవార్డు లభించింది.ఇక చెల్దిగానిపల్లె, కమతమూరు గ్రామాలలో ఉద్యాన రైతు సంఘాలను ఏర్పాటు చేసి రోజాలు, చేమంతులు, క్యాప్సికం, క్యాబేజీ, బీన్స్ రైతులనుంచి సేకరించి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసి లాభాలు గడిస్తున్నారు.తిరుమల ఆలయానికి సైతం పూలు, కూరగాయలు ఇక్కడి నుంచి సరఫరా అవుతున్నాయి. కుప్పానికి పట్టుగూళ్ల మార్కెట్టు కూడా వచ్చింది.శాంతిపురం మండలం నక్కనపల్లెలో రైతు లు పట్టు ఉత్పత్తిలో రాష్ట్రస్థాయి అవార్డులు కూడా పొందారు. నియోజకవర్గవ్యాప్తంగా నెలకు 150మెట్రిక్ టన్నుల బైవోల్టిన్ పట్టు గూళ్లు ఉత్పత్తవుతున్నాయి.

హంద్రీనీవాతో కృష్ణా నీళ్లు

ఈ ప్రాంతంలో ఒకప్పుడు చిన్నపాటి నీటి కుంటలు, చెరువులు తప్ప మరో సాగునీటి వ్యవస్థ లేదు. పాలారు నది నియోజకవర్గంలోనే ప్రవహిస్తున్నా వర్షాకాలంతో తప్ప ఎప్పుడూ నీళ్లుండేవి కావు. చంద్రబాబు సీఎం అయ్యాక పాలారు నదిపై చెక్ డ్యామ్‌లు నిర్మించారు. 2014-2019 నడుమ రూ.575 కోట్ల అంచనా వ్యయంతో హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కెనాల్ పనులకు శ్రీకారం చుట్టారు. 2019కి ముందే సుమారు 80 శాతం పనులు పూర్తయ్యాయి.అయితే మధ్యలో వైసీపీ అధికారంలోకి రావడంతో కాలువ పనులు దాదాపు ఆగిపోయాయి. మళ్లీ 2024లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కాలువ లైనింగ్ పనులకు 97.7 కోట్లు మంజూరయ్యాయి. రామకుప్పం మండల పరిధిలో ఈ పనులు ప్రస్తుతం వేగవంతంగా సాగుతున్నాయి.ఈ కాలువ పూర్తయితే పలమనేరు-కుప్పం నియోజకవర్గాల పరిధిలోని 8 మండలాల్లో 110 చెరువులకు నీళ్ల చేరి, 6300 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందుతుంది. అలాగే తాగునీటి సమస్య కూడా చాలా వరకు పరిష్కారమవుతుంది. మరోవైపు పాలారు మీద ఇప్పటికే ఉన్న చెక్ డ్యామ్‌ల పునరుద్ధరణకు కూడా నిధులు మంజూరయ్యాయి.

చదువుల కుప్పం ఆరోగ్యానికి భరోసా

ఒకప్పుడు కుప్పంలో, రామకుప్పం మండలం బందార్లపల్లెలో మాత్రమే జడ్పీ ఉన్నత పాఠశాలలు నడిచేవి. కుప్పంలోనే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉండేది. డిగ్రీ చదవాలంటే కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్‌కి వెళ్లాల్సిన పరిస్థితి. ఇక వైద్యం విషయానికి వస్తే కుప్పంలో ఆస్పత్రి ఉండేది కానీ, వైద్య సదుపాయాలు అంతంతమాత్రమే. ఆర్ఎంపీలు చేసే అరకొర వైద్యమే ప్రజలకు దిక్కు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత కుప్పం ప్రభుత్వాస్పత్రి అత్యాధునిక వైద్య సదుపాయాలతో కూడిన వంద పడకల ఆస్పత్రిగా మారింది. ప్రైవేటు యాజమాన్యంలో కార్పొరేట్ స్థాయిలో పీఈఎస్ వైద్య కళాశాల, ఆస్పత్రి ఏర్పాటయ్యాయి. మరోవైపు గ్రామానికి ఒకటిరెండు పాఠశాలలు స్థాపించారు. ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్, డిగ్రీ కళాశాలలు ఇబ్బడిముబ్బడిగా వెలిశాయి. కుప్పం ఇంజనీరింగ్ కళాశాల ప్రైవేటు యాజమాన్యంలో ఏర్పాటై సాంకేతిక విద్యను మప్పుతోంది. తాజాగా కుప్పం మండలం బైరుగానిపల్లెలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు స్థలం కేటాయించారు.

బంగారు బాటలు

డొంక దారులు, బండి బాటలు.. ఇవే రహదారులంటే ఒకప్పుడు కుప్పంలో. చుట్టూ అడవి, మధ్యలో పల్లెలు, ఒక పల్లెనుంచి మరో పల్లెకు నడకదారులు. క్రూర మృగాల భయం. పలమనేరు నుంచి కుప్పం మీదుగా తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరికి ఒకేఒక సింగిల్ రోడ్డు. కుప్పం నడిబొడ్డున రైల్వే గేటు. దానికి ఇటూఇటూ బారులుతీరి నిలిచిపోయే వాహనాలు. తీవ్రమైన ట్రాఫిక్ సమస్య. చంద్రబాబు వచ్చాక ఫ్లై ఓవర్ వచ్చింది. ట్రాఫిక్ సమస్య తగ్గింది. పలమనేరు-కృష్ణగిరి మధ్య రహదారి నాలుగు లేన్లుగా మారుతోంది. ప్రతి గ్రామానికి నాలుగు వైపులనుంచీ తారు, సిమెంటు రోడ్లు. ఎటునుంచి ఎటు వెళ్లాలన్నా సాఫీగా సాగే ప్రయాణం. గ్రామగ్రామానా అంతర్గత సిమెంటు రోడ్లు, రక్షిత మంచినీటి సౌకర్యం. బెంగళూరు రాకపోకలు సాగించే ప్రతివొక్క ఎక్స్‌ప్రెస్ రైలు కుప్పంలో ఆగుతోంది. ఇక ఉద్యాన పంటల రవాణాకోసం అనుకున్న కార్గో ఎయిర్‌పోర్టు, మరింత విస్తరించి డొమెస్టిక్ ఎయిర్ పోర్టుగా మారడానికి అంచనాలు తయారయ్యాయి. ఇప్పటికే స్థల సేకరణ పూర్తయింది.

'కడా'తో పక్కా అభివృద్ధి ప్రణాళిక

కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా)తో నియోజకవర్గ పక్కా అభివృద్ధి ప్రణాళిక తయారవుతోంది. కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ నేతృత్వంలో జీరో పావర్టీ దిశగా కార్యకలాపాలు సాగుతున్నాయి.`ఎక్కా ఇళ్లకోసం నియోజకవర్గంలో 14,469 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రభుత్వానికి జాబితా పంపారు. సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ విద్యుత్తు ప్రాజెక్టును కుప్పం మండలం నడిమూరులో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇక్కడ ఇప్పటికే 75 శాతం సోలార్ విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఉచితంగా కనెక్షన్లు ఇస్తున్నారు. ఈ పథకాన్ని నియోజకవర్గం మొత్తం విస్తరించడానికి అవసరమైన కసరత్తు నడుస్తోంది.రాబోయే అయిదేళ్లలో కుప్పానికి పలు జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు రానున్నాయి. దీని కోసం కడా ఇప్పటికే పునాది సిద్ధం చేసింది. ఆలీప్, మదర్ డెయిరీ, ఇ-రాయిస్, టెక్నాల్ ఎనర్జీ, కోవై క్లాసిక్ ఇండస్ట్రీస్, పౌ చెన్, అడిడాస్, యాసిక్స్, న్యూ బ్యాలెన్స్, సాలోమన్ అండ్ టిబర్ ల్యాండ్ తదితర కంపెనీలతో ఇప్పటికే ఎంఓయూలు కుదుర్చుకున్నారు.ఆయా కంపెనీలకు నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో భూములను కేటాయించారు. ఇవిగాక ఈజీ మార్ట్, 1ఎం1బీల ద్వారా వ్యాపార, కెరీర్ గైడెన్స్ ఇస్తున్నారు. ఈ కంపెనీల ద్వారా సమీప భవిష్యత్తులో 30 వేల ఉద్యోగాలు కల్పించనున్నారు. మరోవైపు కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారీపై కసరత్తు నడుస్తోంది. సింగపూర్‌నుంచి వచ్చిన కన్సల్టెన్సీ ద్వారా సర్వే చేస్తున్నారు.యూజీడీ, అండర్ గ్రౌండ్ ఎలక్ట్రిసిటీ, వాటర్ పైపులైన్లతోపాటు సమగ్రమైన అబివృద్ధి రెండేళ్ల కాల వ్యవధిలో పూర్తవుతుందని అంచనా. ఆలీప్ ద్వారా మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే ప్రాజెక్టు సాగుతోంది.

క్రమశిక్షణకు, నిజాయితీకి మారు పేరుగా నిలిచిన పరిపాలనాదక్షుడు. ఎలాంటి సంక్షోభాలనైనా దీటుగా ఎదుర్కోగలిగే బహుముఖ ప్రజ్ఞాశాలి .. దశాబ్దల ముందే అభివృద్ధిని పసిగట్టే విజనరీ.. 75 ఏళ్ల తన జీవితంలో సుమారు 47 ఏళ్లు ప్రజా జీవితానికే అంకితం చేసిన నాయకుడు..మన గడ్డ మీద పుట్టిన బిడ్డ. ఆయన రాజకీయ పాఠాలు నేర్చుకున్నది ఇక్కడే. తన వ్యూహ నైపుణ్యాలను నిరూపించుకున్నదీ ఈ నేలమీదే. చిత్తూరు ఉమ్మడి జిల్లా కేంద్రంగా నడిచిన నారా చంద్రబాబు నాయుడు అడుగుల విశేషాలు ఇవి.. నేడు 75వ పుట్టినరోజు జరుపుకుంటున్న సందర్భంగా ఆంధ్రజ్యోతి అందిస్తున్న ప్రత్యేక కథనం...

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

దటీజ్ చంద్రబాబు..!

- సంక్షోభాలనే అవకాశాలుగా మార్చుకున్న మేరునగధీరుడు
- తొలి రాజకీయ అడుగులు జిల్లాలోనే

తొలి అడుగులోనే ఢీ అంటే ఢీ

కాంగ్రెస్ పార్టీలో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన చంద్రబాబు మంత్రివర్గంలో కూడా చోటు దక్కించుకున్నారు. కాంగ్రెస్ వర్గ రాజకీయాల్లో వేగంగా పట్టు పెంచుకున్నారు. అప్పటికే జిల్లా కాంగ్రెస్‌లో పాతుకుపోయిన నల్లారి అమరనాథరెడ్డి వంటి బలమైన నేతను ఢీకొన్నారు.ఆయన్ను ఎదుర్కొనేందుకు జిల్లాలో నాటి సీనియర్ నేతలైన మంత్రి సి.దాస్, రాయలసీమ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్, పీలేరు ఎమ్మెల్యే మొఘల్ సైఫుల్లా బేగ్ వంటి నేతల మద్దతు తీసుకున్నారు. ఐదేళ్ళ స్వల్ప వ్యవధిలోనే జిల్లాలో బలమైన వర్గ నేతగా ఆవిర్భవించారు.

జడ్పీ చైర్‌పర్సన్‌గా కుతూహలమ్మ ఎన్నిక

కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించిన అభ్యర్థిని కాదని కుతూహలమ్మను జడ్పీ చైర్‌పర్సన్‌గా చేసిన సందర్భం.. చంద్రబాబు రాజకీయ వ్యూహ చతురతకు అద్దం పడుతుంది. చిత్తూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవి 1980లో ఎస్సీలకు రిజర్వయింది. కాంగ్రెస్ అధిష్ఠానం నగరి సమితి అధ్యక్షుడు దొరస్వామిని పార్టీ అధికారిక అభ్యర్థిగా ప్రకటించింది. ఈ నిర్ణయం వెనుక అప్పటి సీనియర్ మంత్రి నల్లారి అమరనాథరెడ్డి ఉన్నారని గ్రహించిన చంద్రబాబు తన వర్గం తరపున అప్పటికి చిన్నగొట్టిగల్లులో ప్రభుత్వ వైద్యురాలిగా పనిచేస్తున్న గుమ్మడి కుతూహలమ్మను అభ్యర్థిగా రంగంలోకి దింపారు. గెలిపించుకోవడానికి కృషి చేశారు. మంత్రి దాసు (సత్యవేడు), పీలేరు, మదనపల్లె ఎమ్మెల్యేలు జీవీ చంద్రశేఖర రెడ్డి, గంగారపు వెంకటనారాయణ, వాయల్పాడు, బంగారుపాళ్యం, చిన్నగొట్టిగల్లు, పుంగనూరు, పలమనేరు సమితీల ప్రెసిడెంట్లు చింతల సురేంద్ర రెడ్డి, అరగొండ రాజా రెడ్డి, బుడుగు భాస్కర రెడ్డి, రామకృష్ణారెడ్డి (అమరనాథ రెడ్డి తండ్రి), రామే గౌడ్‌లతో పాటు గల్లా అరుణకుమారి తండ్రి పాటూరు రాజగోపాల నాయుడు వంటివారు చంద్రబాబుకు మద్దతుగా నిలిచారు. కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసిన దొరస్వామికి మాత్రం చెంగల్రాయ నాయుడు, నల్లారి అమరనాథ రెడ్డి, అప్పట్లో సమితి ప్రెసిడెంట్‌గా ఉన్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి తదితరులు మద్దతు ఇచ్చారు. జడ్పీ ఎన్నిక సమయంలో కోఆప్షన్ మెంబర్‌గా కుతూహలమ్మను ప్రపోజ్ చేసి ఎన్నుకున్నారు. దీంతో ఆమెకు కూడా ఓటింగ్‌లో పాల్గొనే హక్కు వచ్చింది. ఓటు హక్కు కలిగిన మదనపల్లె ఎమ్మెల్యే వెంకటనారాయణరెడ్డి కేరళలోని ఆయుర్వేదిక్ ఆసుపత్రిలో ఉన్నారు. ఆయనను చంద్రబాబు వ్యతిరేక వర్గం తమ క్యాంపులోకి తీసుకువెళ్లేందుకు ప్రయత్నించింది. విషయం తెలుసుకున్న చంద్రబాబు వెంకటనారాయణరెడ్డిని కేరళ నుంచి తీసుకొచ్చేశారు. ఒక్క ఓటు తేడాతో కుతూహలమ్మ జడ్పీ చైర్‌పర్సన్‌గా గెలిచారు. ఈ పరిణామం చంద్రబాబు రాజకీయ జీవితంలోనే ఒక మలుపుగా మారింది. దీనిపై అధిష్ఠానం సీరియస్ అయింది. చంద్రబాబుతో పాటు మంత్రి దాసు, రాయలసీమ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మెన్ సైఫుల్లాబేగ్‌లను సస్పెండ్ చేసింది. అయితే కొన్నాళ్ల తర్వాత సస్పెన్షన్ ఎత్తేశారు.

గురువు చంద్రబాబు

కుతూహలమ్మ నిత్యం చంద్రబాబుకు శిష్యురాలిగా చెప్పుకునేది. అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ అయ్యాక కూడా పబ్లిక్ మీటింగుల్లో నాకు గురువు చంద్రబాబే అని చెప్పుకునే వారు.

టీడీపీలోకి ఇలా వచ్చారు

1978-83 మధ్యలో చంద్రగిరి నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా పనిచేసిన చంద్రబాబు 1983లో చంద్రగిరి నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి టీడీపీ అభ్యర్థి మేడసాని వెంకట్రామానాయుడు చేతిలో ఓటమి చెందారు. 1984లో ఎన్టీఆర్ వైద్యం కోసం అమెరికా వెళ్లినప్పుడు నాదెండ్ల భాస్కర రావు కాంగ్రెస్‌తో చేతులు కలిపి అడ్డదారిలో అధికారాన్ని చేజిక్కించుకున్నాడు. అప్పటికే భువనేశ్వరిని పెళ్లి చేసుకుని ఎన్టీఆర్ అల్లుడిగా ఉన్న చంద్రబాబు, ఆ ఉపద్రవాన్ని తిప్పికొట్టడానికి రంగప్రవేశం చేశారు. ఎమ్మెల్యేలందర్నీ మైసూరులో క్యాంపు నిర్వహించి బలప్రదర్శన చేసి నెల రోజుల్లోనే మళ్లీ ఎన్టీఆర్‌ను సీఎం చేశారు. దీంతో ఎన్టీఆర్ ఆయనకు పార్టీ ప్రధాన కార్యదర్శి పగ్గాలను అప్పగించారు. అలా చంద్రబాబు అప్పటి నుంచి టీడీపీలో కీలకంగా వ్యవహరిస్తూ వచ్చారు. ఆ తర్వాత కొన్నాళ్లు కర్షక పరిషత్ చైర్మన్‌గా కూడా పనిచేశారు.

జిల్లాలో ఎదురులేని నేతగా



చంద్రబాబు టీడీపీ ప్రధాన కార్యదర్శిగా ఉంటూ పార్టీ మీదే ఎక్కువగా ఫోకస్ చేసేవారు. నియోజకవర్గాల వారీ సమావేశాలను ఆయా ప్రాంతాల్లో కింద కూర్చొని మరీ నిర్వహించేవారు. చిత్తూరు- పుత్తూరు రోడ్డులోని ఆర్ఎల్ఎన్ కళ్యాణమండపానికి ఎదురుగా ఉన్న మామిడి తోటలో ఎన్నోసార్లు కింద కూర్చొని సమావేశమయ్యేవారు. మండల పార్టీ ప్రెసిడెంట్లను కూడా పేరు పెట్టి పిలిచేంత పట్టును పెంచుకున్నారు.సంస్థాగతంగా పార్టీపై పట్టు పెంచుకున్న చంద్రబాబు 1985 ఎన్నికల నుంచీ జిల్లాలో ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపు విషయంలో ప్రభావం చూపుతూ వచ్చారు. తన మద్దతుదారులకు టికెట్లు ఇప్పించడంతో పాటు వారి గెలుపుపై కూడా వ్యక్తిగత శ్రద్ధ చూపించారు. పార్టీలో అసంతృప్తులను,అసమ్మతి వర్గీయులను బుజ్జగించడం,సర్దుబాట్లు చేయడం, అభ్యర్థులకు పార్టీ ఇచ్చే ఆర్థిక సాయానికి తోడు వ్యక్తిగతంగా సాయం చేయడం వంటి చర్యలతో ఎమ్మెల్యేలు నైతికంగా చంద్రబాబు వైపు మొగ్గు చూపడం మొదలైంది. అలా జిల్లాలో పూర్తిస్థాయి పట్టు సాధించారు. ఆ క్రమంలో మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమ నాయుడు వంటి బలమైన నేతలు తొలుత చంద్రబాబును వ్యతిరేకించినా తర్వాత చంద్రబాబుతో కలసిపోయి ఆయన వెన్నంటి నడిచారు. దీంతో జిల్లా టీడీపీలో చంద్రబాబుకు ఎదురే లేకుండా పోయింది.

ఏఎస్ మనోహర్ ఎన్నిక కోసం

1994లో ఎన్నికల్లో 15 స్థానాలకు గానూ చిత్తూరు మినహా 14 చోట్ల టీడీపీ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలిచారు. చిత్తూరులో మాత్రం టీడీపీ అభ్యర్థి ఏఎస్ మనోహర్ పోటీ చేసి ఓడిపోయారు. 1995లో వచ్చిన మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ అధిష్ఠానం ఏఎస్ మనోహర్‌ను చైర్మన్ అభ్యర్థిగా ఎంపిక చేసింది. మొత్తం 35 వార్డులుండగా.. జిల్లాలోని 14 మంది ఎమ్మెల్యేలు చిత్తూరులో మకాం వేశారు. చంద్రబాబు ఆధ్వర్యంలో ఒక్కో ఎమ్మెల్యేకి రెండు వార్డుల ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఫైనాన్స్ మినిస్టర్ హోదాలో ఉండి చంద్రబాబు చిత్తూరులోనే మకాం వేసి ఏఎస్ మనోహర్‌ను గెలిపించుకున్నారు. జ్యోతినాథ్ కాంగ్రెస్ తరఫున, సీకే లావణ్య స్వతంత్రంగా పోటీ చేసి ఏఎస్ మనోహర్ చేతిలో ఓడిపోయారు.